సాక్షి
పెద్దపల్లి

బుధవారం । 25 । డిసెంబర్ । 2024

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. తొలుత మతపెద్దలు కేక్‌లు కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. క్రీస్తు బోధనల గురించి వివరించారు. ఏసుక్రీస్తు బోధనలు అనుసరించాలని సూచించారు. పెద్దపల్లి, గోదావరిఖని, మంథని, సుల్తానాబాద్ తదితర ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



పెద్దపల్లిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

న్యూస్‌రీల్

కోర్టు ఆవరణలో ఈ సేవ కేంద్రం

మంథని: స్థానిక సీనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మూల స్వాతిగౌడ్ మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 29 జిల్లాల్లో ఎంపిక చేసిన 29 కోర్టుల్లో కక్షిదారులు, న్యాయవాదుల సౌకర్యార్థం ఈ సేవ కేంద్రాలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అధారే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంథని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు, ఉపాధ్యక్షుడు కె.రఘోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సహేందర్‌రెడ్డి, న్యాయవాదులు సువర్ణ చంద్రశేఖర్, శశికాంత్ కాచె, బోట్ల ఆంజనేయులు, సత్యనారాయణ, సదస్ కుమార్, శశి భూషణ్ కాచె పాల్గొన్నారు.

'విద్యుత్ కొరత రానివ్వం'

పెద్దపల్లిరూరల్: వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో సర్కిల్ ఎస్ఈ మాధవరావు తెలిపారు. గతానుభవాలను దృష్టిలో ఉంచుకుని డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు జిల్లాలో 160 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. మరో 74 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

ప్రొటోకాల్ చిచ్చు

- ప్రొటోకాల్ పాటించినా.. పాటించకపోయినా.. అభివృద్ధి కార్యక్రమాలకు పిలిచినా.. పిలవకపోయినా.. నేను వస్తా.

– సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో పెద్దపల్లిలో ఇటీవల నిర్వహించిన యువ వికాసం సభలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ అసహనం.

- ప్రొటోకాల్ పాటించటం లేదు.. ఇది ఎవరు చేయిస్తున్నారు.. ఎందుకు చేయిస్తున్నారో.. నేను ఎంపీని. నేమ్ ప్లేట్‌లో నా పేరు లేదు.. అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదు.. నన్ను ఎన్నుకున్న ప్రజల కోసమే పనిచేస్తున్న.. ఈరోజు కూడా అధికారిక కార్యక్రమాలు ఉన్నాయి. కానీ, నాకు ఇన్విటేషన్ రాలేదు.. ఇద్దరమూ యంగ్‌గానే ఉన్నాం.. మంచిగా పనిచేస్తామంటే కుదరడం లేదు.. కలెక్టర్ ఎవరి ఆదేశాల మేరకు పనిచేస్తున్నారో నాకు అర్థం కావడం లేదు.

– మంగళవారం కలెక్టర్, ఎమ్మెల్యేలపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆగ్రహం.

- కాంగ్రెస్‌లో అంతర్గత పోరు
- అధిపత్యం కోసం నేతల ఆరాటం
- తనకు గౌరవం ఇవ్వడం లేదని పార్లమెంటు సభ్యుడి వ్యాఖ్య
- వంశీకృష్ణ, ఎమ్మెల్యేల మధ్య పెరుగుతున్న అంతరం

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ప్రొటోకాల్ చిచ్చుతో పొలిటికల్ మంటలు చెలరేగుతున్నాయి. తనకు కనీస గౌరవం ఇవ్వడం లేదని, చట్టసభ సభ్యుడిగా గుర్తించటం లేదని ఎంపీ గడ్డం వంశీకృష్ణ బహిరంగంగా అసహనం వ్యక్తం చేయడం కాంగ్రెస్ పార్టీలోనూ చర్చనీయాంశంగా మారింది. అగ్రకుల మైండ్ సెట్‌తో కుల, మతపిచ్చితో పనిచేస్తే సమాజం ముందుకు పోదని ఎంపీ తాజాగా చేసిన వ్యాఖ్యలతో కొద్దిరోజులుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న అంతర్గత, అధిపత్య కుమ్ములాట ఒక్కసారిగా బహిర్గతమైంది.

అందరూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులే..

పెద్దపల్లి(ఎస్సీ) పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలిచిన ఏడుగురూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే. అందులో చెన్నూరు నుంచి వంశీకృష్ణ తండ్రి వివేక్, బెల్లంపల్లి నుంచి పెద్దనాన్న వినోద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2024లో జరిగిన ఎంపీ ఎన్నికల్లో కాకా వారసుడి(మనవడి)గా గడ్డం వంశీకృష్ణ ఎంపీగా గెలుపొందారు. అప్పటినుంచి చెన్నూరు, బెల్లంపల్లి మినహా మిగిలిన నియోజకవర్గాల్లో ఆయనకు ప్రాతినిధ్యం దక్కడం లేదని, పార్టీ కార్యకలాపాలు, అభివృద్ధి పనులకు కూడా ఆహ్వానించడం లేదని అసంతృప్తితో రగిలిపోతున్నారు. శిలాఫలాకాల్లోనూ తన పేరు ఉండటం లేదని ఆవేదన చెందడం కాంగ్రెస్ శ్రేణుల్లో ముదురుతున్న అసంతృప్తిపై చర్చకు దారితీస్తోంది.

గతంలో ఎంపీలకు సైతం..

గత పదేళ్లలో పెద్దపల్లి ఎంపీలుగా ఎన్నికైన బాల్క సుమన్, వెంకటేశ్ నేత బీఆర్ఎస్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. అయితే, స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనుమతి లేనిదే వారు తమ నియోజకవర్గంలో పర్యటించలేని పరిస్థితి నెలకొని ఉండేది. ఎమ్మెల్యేలు ఆహ్వానిస్తేనే ఎంపీలు హాజరయ్యేవారు. కేసీఆర్ సైతం ఎమ్మెల్యేలనే నియోజకవర్గాలకు బాస్‌లు గుర్తించడంతో ఎంపీలు నామమాత్రంగానే మారిపోయారు. ఎమ్మెల్యేలు గ్రూపులు కట్టకుండా ఎంపీలను కట్టడి చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా.. ఆ పార్టీ ఎమ్మెల్యేలు సైతం బీఆర్ఎస్ బాటలోనే పయనించడంతో ప్రొటోకాల్ వివాదం తలెత్తుతోందని విశ్లేషకులు అంటున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో వంశీకృష్ణ కుటుంబ జోక్యంతో గ్రూప్‌లు పెరుగుతాయని, గతంలో ఇలాగే గ్రూప్‌లు కట్టి ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి నష్టం చేశారని ఎమ్మెల్యేల వర్గీయులు అంటున్నారు. వంశీకృష్ణ విషయంలో ఎమ్మెల్యేల వ్యవహార శైలి కరెక్టే అనే వాదన కూడా కాంగ్రెస్ శ్రేణుల్లో వినిపిస్తోంది.



పెద్దపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

కలెక్టర్ కులపిచ్చితో పని చేస్తుండు..

పెద్దపల్లి ప్రజల గుండెల్లో కాకా(మాజీమంత్రి జి.వెంకటస్వామి) ఉన్నారని, ఇతర జిల్లాల్లో వర్ధంతి నిర్వహించగా, ప్రభుత్వ జీవో ఉన్నా పెద్దపల్లిలో వర్ధంతి నిర్వహించకపోవడం బాధాకరమని వంశీకృష్ణ మీడియాతో అన్నారు. అగ్రకుల మైండ్ సెట్, కుల పిచ్చితో పనిచేస్తున్న కలెక్టర్‌కు నీతిపాఠం తెలియజేయాల్సిన అవసరం ఉందని ఎద్దేవా చేశారు. ఇది కాకాకు జరిగిన అవమానం కాదని, యావత్ దళితులకు జరిగిన అవమానమని పేర్కొన్నారు. ప్రివిలేజ్ మోషన్ ద్వారా లోక్‌సభ స్పీకర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని ఎంపీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, నాయకులు భూషణవేన రమేశ్‌గౌడ్, నల్లాల కనకరాజు, సజ్జాద్, పునుకొండ శ్రీధర్, బండారి సునీల్, గంగుల సంతోష్, మానమాండ్ల శ్రీనివాస్, కొలిపాక సంపత్, కీర్తి రాజయ్య పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు



వైద్యసేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

కోల్‌సిటీ(రామగుండం): సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)ను మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీంతో డాక్టర్లు, వైద్య సిబ్బంది హడలిపోయారు. పలు విభాగాల్లో డాక్టర్లు లేకపోవడంతో వారి గురించి ఆరా తీశారు. బయోమెట్రిక్ వేసి విధులకు హాజరుకాని వారి వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పాత బ్లాక్‌తో పాటు కొత్త బ్లాక్ లోని అన్ని విభాగాలు, వార్డులను పరిశీలించారు. పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. స్కానింగ్ పరీక్షల ఫలితాలను త్వరగా అందజేయాలన్నారు. అనంతరం సిమ్స్ కాలేజీ ప్రాంతాన్ని పరిశీలించారు. డాక్టర్ల కోసం వేచి ఉన్న పేషెంట్లు, వారి సహాయకులతో మాట్లాడి, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. టిఫా స్కానింగ్ సేవలను గర్భిణులు వినియోగించుకునేలా చూడాలని పేర్కొన్నారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో నిర్మిస్తున్న 355 పడకల భవనం పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. మరో 10 నెలల్లో పనులను పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్, ఆర్ఎంవోలు అశోక్, అప్పారావు, చంద్రశేఖర్, తిరుమలేశ తదితరులు పాల్గొన్నారు.

ఏసు అనుగ్రహం ఉండాలి : మక్కాన్‌సింగ్



కేక్ కట్ చేస్తున్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ఏసు అనుగ్రహం అందరిపై ఉండాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆకాంక్షించారు. స్థానిక బృందావన్ గార్డెన్‌లో ప్రభుత్వం తరఫున మంగళవారం ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. మానవవాళికి ప్రేమ, శాంతిమార్గం చూపిన మహనీయుడు ఏసుక్రీస్తు అని అన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ పెట్టారు. ఏసీపీ రమేశ్, తహసీల్దార్ కుమారస్వామి, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల అభ్యున్నతికి కృషి : విజయరమణారావు



క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే విజయరమణారావు, చిన్నారులు

పెద్దపల్లిరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని తమ ప్రభుత్వం క్రైస్తవుల అభ్యున్నతికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ప్రభుత్వ తరఫున జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు. చర్చిల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అన్నారు. క్రిస్మస్ వేడుకల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్లు ఈర్ల స్వరూప, ప్రకాశ్‌రావు, కౌన్సిలర్లు, పాస్టర్లు, క్రిస్టియన్ మతపెద్దలు, ప్రజాప్రతినిధులతోపాటు తహసీల్దార్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోనాలతో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు, నాయకులు

పెద్దపల్లిరూరల్: కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని పాలకుల ఇచ్చిన హామీలు అమలయ్యేలా చూడాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరారు. ఈమేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో బోనాలతో పోచమ్మతల్లి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. అమరవీరుల స్థూపం నుంచి కోలాటాలు ఆడుతూ, తలపై బోనాలు ఎత్తుకుని పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. పాలకుల మనసు మార్చి తమ సమస్యలకు పరిష్కారం చూపాలని జేఏసీ అధ్యక్షుడు తిప్పని తిరుపతి, ప్రతినిధులు కుంభాల సుధాకర్, సంధ్యారాణి కోరారు. నాయకులు రాజ్‌కుమార్, శ్రీనివాస్, స్వప్న, స్వరూప, మంజుల, కల్పన, సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తహసీల్ ఆఫీసు తనిఖీ



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

రామగుండం: కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటరు నమోదు దరఖాస్తుల ప్రగతి, ధరణి అర్జీలపై ఆరా తీశారు. పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

పైరవీలకు తావులేదు



చెక్కులు అందిస్తున్న విప్ అడ్లూరి

ధర్మారం(ధర్మపురి): ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పైరవీలకు తావులేదని, అర్హులైన పేదలకు తప్పకుండా మంజూరు చేస్తామని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 155 మంది లబ్ధిదారులకు రూ.29 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన మంగళవారం పంపిణీ చేసి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్భాటాలకు వెళ్లి 11శాతం వడ్డీతో అప్పులు చేసి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూనే సంక్షేమ పథకాలను దశల వారీగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేస్తామని ఆయన తెలిపారు. ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లనాయక్, వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, మాజీ ఎంపీపీ కొడారి అంజయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, ఎంపీడీవో ప్రేమ్‌కుమార్, ఎంపీవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ కొనివ్వలేదని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

మెట్‌పల్లిరూరల్: బైక్ కొనివ్వలేదనే కారణంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మెట్‌పల్లి మండలం వేంపేటకు చెందిన మామిడాల రణధీర్ (22) హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఇటీవల ఓ ఫంక్షన్ నిమిత్తం ఇంటికి వచ్చిన కిరణ్ బైక్ కొనివ్వాలని తరచూ గొడవ చేస్తున్నాడు. తల్లిదండ్రులు కొనివ్వకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈనెల 22న గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు కిరణ్‌ను మెట్‌పల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. రణధీర్ తండ్రి ప్రకాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి వృద్ధుడు..

గంగాధర: గంగాధర గ్రామానికి చెందిన పులిచర్ల భూమయ్య (65) మంగళవారం సాయంత్రం గ్రామ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం నుంచి నిజామాబాద్ వెళ్తున్న ప్యాసింజర్ రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకోవడంతో తల, మొండెం వేరుగా పడ్డాయి. స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు విచారణ జరుపుతున్నారు

ఫలహారంగా ప్రభుత్వ భూములు

- ప్రభుత్వ కార్యాలయాలు, ఆలయాల నిర్మాణాలు
- అందులోనే వెంచర్ ఏర్పాటు చేసిన రియల్టర్లు
- వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు.. రంగంలోకి అధికారులు



టెక్స్‌టైల్ భూముల్లో గత ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం



టెక్స్‌టైల్ భూముల ఆక్రమణపై విచారణ జరుపుతున్న అధికారులు(ఫైల్)

రామగుండం: అంతర్గాంలోని టెక్స్‌టైల్ భూములు కబ్జాదారులకు ఫలహారంగా మారాయి. సుమారు మూడు దశాబ్దాల క్రితం వరకు ఇక్కడ స్పిన్నింగ్, వీవింగ్ మిల్లులు నడిచాయి. అందులో వేలాది మంది బర్మా, శ్రీలంక కాందీశీకులు ఉపాధి పొందారు. ఆ తర్వాత మిల్లులు మూతపడ్డాయి. దీంతో కార్మికులకు పీఎఫ్, ఇతర ప్రయోజనాలేవీ రాలేదు. ఖాళీగా ఉన్న ఆ భూముల్లో పరిశ్రమలు స్థాపించి కాందీశీకులకు ఉపాధి కల్పిస్తామని పాలకులు చెబుతూ వచ్చారు. దాదాపు ముప్పయి ఏళ్లు గడిచాయి. అందులోని ఒకతరం కాలగర్భంలో కలిసిపోయింది. కనీసం వారివారసులకైనా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నారు. కానీ, అంతర్గాంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అంతర్గాంలో అనువైన ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందని ఇటీవల పార్లమెంట్‌లో సర్కార్ ప్రకటన చేయడంతో బడాబాబుల కన్ను వాటిపై పడింది. శిథిలావస్థలోని కార్మికులు, ఉద్యోగుల క్వార్టర్లు, ఖాళీ భూములు ఇప్పటికీ నిరుపయోగంగా ఉన్నాయి. స్పిన్నింగ్ మిల్లుకు చెందిన 51.38 ఎకరాలు, వీవింగ్ మిల్లుకు చెంది 502.09 ఎకరాలు ఉన్నాయని రికార్డులు చెబుతున్నాయి. అయితే, ఇందులో కొన్ని ఇప్పటికే కబ్జాదారుల పాలయ్యాయి.

టెక్స్‌టైల్ భూముల్లో ప్రభుత్వం పాగా..

టెక్స్‌టైల్ శాఖకు చెందిన భూముల్లో ఇప్పటికే గత ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టింది. సర్వే నంబరు 250/2లోని 1.15 ఎకరాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం, సర్వే నంబరు 325/2లోని రెండెకరాల్లో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయం, సర్వే నంబరు 272లో ఆలయ నిర్మాణం కొనసాగుతోంది. 335/2 సర్వే నంబరులోని మరో 17 ఎకరాలు కబ్జాదారుల చేతుల్లో చిక్కింది.

ఎయిర్‌పోర్టుకు 600 ఎకరాలు?

అంతర్గాం టెక్స్‌టైల్ భూములతోపాటు వాటిని ఆనుకొని ఉన్నవాటితోపాటు 600 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మించేందుకు అవకాశం ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపాదించాయి. అంతకు ముందే రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్.. టెక్స్‌టైల్ భూముల్లో పరిశ్రమలు స్థాపించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. తెరపైకి ఎయిర్‌పోర్టు ప్రతిపాదనలు రావడంతో బడాబాబులు ఆ భూములపై కన్నేశారు.

సర్వే చేసిన అధికారులు..

టెక్స్‌టైల్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయనే ఫిర్యాదు మేరకు ఆ శాఖతోపాటు రెవెన్యూ అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో సర్వే చేశారు. ఆక్రమణలపై ప్రభుత్వానికి నివేదించి, తదుపరి ఆదేశాల మేరకు హద్దురాళ్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

ఎవరినీ ఉపేక్షించేది లేదు



టెక్స్‌టైల్ శాఖ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని మా దృష్టికి వచ్చింది. అలాంటి వాటిని గుర్తించి త్వరలోనే హద్దురాళ్లు ఏర్పాటు చేస్తాం. భూములను కబ్జా చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదు.

– రవీందర్, తహసీల్దార్, అంతర్గాం

సమస్యలు పరిష్కరించాలి



అంతర్గాంలోని బర్మా, శ్రీలంక, కాందీశీకుల ఆర్థిక, భూ సంబంధిత సమస్యలను సత్వరమే పరిష్కరించాలి. ఇప్పటికే ఒకతరం మట్టిలో కలిసిపోయింది. వారి వారసులనైనా ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి.

– రామారావు, అధ్యక్షుడు, కాందీశీకుల సంఘం

పరిశ్రమలు స్థాపిస్తాం



టెక్స్‌టైల్ శాఖకు చెందిన అంతర్గాం స్పిన్నింగ్, వీవింగ్ మిల్లు భూముల్లో పరిశ్రమలు స్థాపించేందుకు ఇప్పటికే కార్యాచరణ రూపొందించాం. అంతకు ముందుగానే కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం.

– మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే

క్షమాపణ చెప్పి.. రాజీనామా చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ, నాయకులు

- పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ

సాక్షి, పెద్దపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు దేశప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, ఆ తర్వాత తన పదవికి రాజీనామా చేయాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేశారు. కేంద్రమంత్రి తీరుకు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో ఎంపీ వంశీకృష్ణ మీడియా సమావేశంలో మాట్లాడారు. అంబేడ్కర్‌ను అవమానించేలా అమిత్‌షా మాట్లాడారని, ఇవే మాటలు పార్లమెంట్ ఎన్నికలకు ముందు మాట్లాడితే 40 సీట్లు కూడా బీజేపీకి వచ్చేవి కాదన్నారు. ప్రధాని మోదీ.. అమిత్‌షాపై చర్యలు తీసుకోకుండా, అంబేడ్కర్‌పై ప్రేమ ఉన్నట్లు ట్వీట్లు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మణిపూర్ అల్లర్ల అంశంపై స్పందించి ఇరువర్గాల మధ్య శాంతి నెలకొల్పాలని కోరారు. మందకృష్ణ ఎజెండా వేరేగా ఉందని, క్రీమీలేయర్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ఎంపీ అన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

సుల్తానాబాద్(పెద్దపల్లి): కేంద్రమంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని ఎంపీ వంశీకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్, మాజీమంత్రి గడ్డం వెంకటస్వామి విగ్రహాలకు ఆయన పూలమాలవేశారు. పార్లమెంటులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై నిరసన తెలిపారు. అక్కడి నుంచి రాజీవ్ రహదారిపై వెంకటస్వామి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా మంత్రి అమిత్ షా మాట్లాడడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు సజ్జత్, కోడెం అజయ్, కుక్క కనకరాజు, కనుకయ్య, రాజ కొమురయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): దుబ్బపల్లి గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో రామగుండం ప్రాంతానికి చెందిన అప్సరుద్దీన్(31)మృతి చెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. అప్సరుద్దీన్ ద్విచక్ర వాహనంపై కరీంనగర్ వెళ్తుండగా.. దుబ్బపల్లి వద్ద తొలుత కారు ఢీకొంది. దీంతో అతడు కింద పడగా వెనకాల కరీంనగర్ వైపుకే వెళ్తున్న లారీ అప్సరుద్దీన్‌పైకి ఎక్కింది. దీంత అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు.

రైలు కింద పడి యువకుడు..

రామగుండం: అంతర్గాం మండలం పెద్దంపేట రైల్వేగేట్ వద్ద గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీకి చెందిన పొనగంటి సునీల్(33) సోమవారం అర్ధరాత్రి రైలు కిందపడి మృతిచెందాడు. ఈమేరకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారని జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి మంగళవారం తెలిపారు. మృతుడు అవివాహితుడు. అతడికి సోదరుడు రవికుమార్, సోదరి లావణ్య, బావ సురేందర్ ఉన్నారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపడుతున్నామని తిరుపతి పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిపేట మండలంలో..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాగట్లపల్లి శివారులోని మొండిచింత మూలమలుపు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు.. ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన సబ్బని జగన్(40) సోమవారం రాత్రి బైక్‌పై ఎల్లారెడ్డిపేటకు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. రాగట్లపల్లి శివారులోని మొండిచింత మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య దివ్య.. తన భర్త బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందినట్లు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.



పొనగంటి సునీల్(ఫైల్)

వాగులో పడి మహిళ..

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన మామిడి రాజేశ్వరి(55) మూడు రోజుల క్రితం ప్రమాదవశాత్తు మానేరు వాగులో పడి గల్లంతు కాగా, మంగళవారం మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాలు.. రాజేశ్వరి కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేక ఇబ్బంది పడుతుంది. ఈ క్రమంలో ఇంట్లో నుంచి వెళ్లి వాగులో ప్రమాదవశాత్తు పడి నీట మునిగింది. మృతురాలి తల్లి కనుకమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

ఇల్లంతకుంట(మానకొండూర్): అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు యత్నించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాలు.. మండలంలోని పెద్దలింగాపురం గ్రామానికి చెందిన బండ గాలవ్వ(80) ఏడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతుంది. అనారోగ్యం భరించలేక సోమవారం వేకువజామున తన వద్ద ఉన్న బీపీ గోలీలు, గుండెకు సంబంధించిన గోలీలు అధికంగా మింగడం వల్ల వాంతులు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఆమె కొడుకు వెంటనే సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మృతురాలి కొడుకు రామచంద్రం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మల్యాల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని బల్వంతాపూర్‌లో విషాదం నింపింది. బల్వంతాపూర్ గ్రామానికి చెందిన నాగుల మొండయ్య, నర్సవ్వ భార్యాభర్తలు. 20 రోజుల క్రితం ఇద్దరూ కలిసి కొండగట్టుకు వెళ్తున్నారు. ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. నర్సవ్వ (60) కోమాలోకి వెళ్లింది. కరీంనగర్ ఆస్పత్రిలో ఆమెకు చికిత్స అందిస్తున్నారు. వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. మంగళవారం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

రూ.3 కోట్లతో చిట్టీ వ్యాపారి పరార్

పెద్దపల్లిరూరల్: స్థానిక శివాలయం వీధి ప్రాంతానికి చెందిన ఓ చిట్టీ వ్యాపారి దాదాపు రూ.3 కోట్ల చిట్టీ డబ్బులతో పరారయ్యాడు. ఈమేరకు పలువురు బాధితులు మంగళవారం ఎస్సై లక్ష్మణ్‌రావును ఆశ్రయించారు. కొన్నేళ్లుగా చిట్టీ వ్యాపారం చేస్తూ నమ్మకంగా ఉన్న హనుమాన్‌ప్రసాద్ అనే వ్యాపారి.. కొద్ది రోజులుగా కనిపించకుండా పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు చిట్టీ డబ్బులు ఇవ్వలేదని ఎస్సైకి మొరపెట్టుకున్నారు. కొందరు బాధితుల నుంచి ఫిర్యాదు అందిందని, ఇప్పటివరకు రూ.కోటి 60లక్షల వివరాలు అందాయని ఎస్సై తెలిపారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని, విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని వివరించారు.

ఫౌండేషన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: మైనారిటీ సంక్షేమశాఖ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్-1,2,3,4, ఎస్ఎస్‌బీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ పీవో నియామక పరీక్షల కోసం నాలుగు నెలల ఉచిత కోర్సు కోసం మైనార్టీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పి.పవన్‌కుమార్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు లింక్ https:// forms.gle/R7Z9 WtqJygj1At 9 C7 ద్వారా నాలుగు నెలల ఫౌండేషన్ కోర్సు కోసం నమోదు చేసుకోవాలని తెలిపారు. కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీల సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. కోర్సులో నమోదు చేసుకోవడానికి జనవరి 17 చివరి తేదీ అని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే కార్యాలయ వేళల్లో 0878–2957085ను సంప్రదించాలని సూచించారు.

అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు

కరీంనగర్ అర్బన్: వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువును మరోమారు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని ఐఅండ్‌పీఆర్ ఏడీ లక్ష్మణ్ తెలిపారు. ఈ నెల 31వ తేదీతో కార్డుల గడువు ముగియనున్నందున పలు కారణాలతో మరో 3 నెలల పాటు గడువు పెంచిందని వివరించారు. జనవరి 1, 2025 నుంచి మార్చి 31, 2025వరకు అక్రిడిటేషన్ కార్డులను వినియోగించవచ్చని పేర్కొన్నారు.

పలు పరీక్షలు వాయిదా

కరీంనగర్‌సిటీ: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని పీజీ, ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీసెట్, యూజీ సెట్ ఉన్నందున పరీక్షలు వాయిదా వేశామని, తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో తెలియజేస్తామని తెలిపారు.


డిగ్రీ పరీక్షల్లో ఆరు మాల్‌ప్రాక్టీస్ కేసులు

శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం ఆరు మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి తెలిపారు. కరీంనగర్‌లోని వివిధ కళాశాలల్లో ఈ కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు.

6నుంచి ఎల్ఎల్‌బీ సెమిస్టర్స్

శాతవాహన యూనివర్సిటీ పరిధిలో 2025 జనవరి 6వ తేదీ నుంచి ఎల్ఎల్‌బీ 5వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణ అధికారి తెలిపారు. 1వ పేపర్ 6వ తేదీన, 2వ పేపర్ 8వ తేదీన, 3వ పేపర్ 10న, 4వ పేపర్ 17న, 5వ పేపర్ 20వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



నర్సయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న లింగవ్వ

రాయికల్: చెట్ల కొమ్మలు క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి రైతు దుర్మరణం పాలైన ఘటన మండలంలోని అల్లీపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై సుధీర్‌రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్లపల్లి నర్సయ్య (56)కు రెండెకరాల పొలం ఉంది. కొద్ది దూరంలో విద్యుత్ స్తంభం ఉండడంతో మోటార్ కనెక్షన్ కోసం వైరును చెట్ల కొమ్మలతోపాటు అక్కడక్కడ కర్రలు పాతుకున్నాడు. వైరు వెళ్తున్న ప్రాంతమంతా చిత్తడిగా మారడంతో తొలగించేందుకు మంగళవారం పొలానికి వెళ్లాడు. పొదలను తొలగిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు వైర్‌కు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడు. నర్సయ్యకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. నర్సయ్య భార్య లింగవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అటవీభూమిని సాగుచేసిన వ్యక్తిపై కేసు

చందుర్తి(వేములవాడ): అటవీ భూమిని సాగు చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. అటవీశాఖ అధికారుల కథనం మేరకు.. సనుగులకు చెందిన పిట్టల లచ్చయ్య గతంలోనే అటవీ భూమిని చదును చేసి పత్తి వేశాడు. అటవీ భూమి సాగు చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించినా వినకుండా, మళ్లీ పత్తి తీసేసి వేరే పంట సాగు చేసేందుకు మంగళవారం కేజ్ వీల్స్ ట్రాక్టర్‌తో దున్నుతుండగా సనుగుల బీట్ ఆఫీసర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. లచ్చయ్య, డ్రైవర్ ఎల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు రేంజ్ అధికారి ఖలీలోద్దీన్ తెలిపారు.

సాగునీటి కోసం రైతు ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు



పురుగుమందు డబ్బాతో యువ రైతు



పవర్ ప్లాంట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

మంథని: సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుతో నీళ్లు అందక పంటలు నష్టపోతున్న తమకు న్యాయం చేయాలని పెద్దపల్లి జిల్లా మంథని మండలం పోతారం గ్రామానికి చెందిన రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఎస్సారెస్పీ కాలువ పరిధిలోని ఎల్–6 కాలువను ఆక్రమించి పోతారంలో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మించారని, దీనిద్వారా పంటలకు సాగునీరు రావడం లేదని ఆవేదన చెందారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. దీంతో తాము హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. తమకు న్యాయం చేయాలని, కాలువను పునరుద్ధరించాలని కోర్టు ఉత్తర్వులు జారీచేసిందని వారు గుర్తుచేశారు. అయినా, సోలార్ పవర్ ప్లాంట్ కంపెనీ నిర్వాహకులు కోర్టు ఆదేశాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తద్వారా సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న క్రమంలో ఓ యువ రైతు పురుగుల మందు డబ్బా పట్టుకొని మందు తాగేందుకు యత్నించాడు. అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు రైతును అడ్డుకొన్నారు. ఆ తర్వాత ఆయనను అదుపులోకి తీసుకుని సర్దిచెప్పడంతో శాంతించాడు. ఈ విషయంపై నీటిపారుదల శాఖ అధికారులతో పోలీసులు ఫోన్‌తో మాట్లాడారు. హైకోర్టు తీర్పు ఆధారంగా కాలువను 20 రోజుల్లో పునరుద్ధరిస్తామని ప్లాంట్ సైట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

నేటి నుంచి ఎస్సారెస్పీ నీటి విడుదల

- ఆన్, ఆఫ్ పద్ధతిలో సాగునీరు
- ఏప్రిల్ వరకు చివరి తడి



జగిత్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు ఈనెల 25 నుంచి సాగు నీటిని విడుదల చేస్తున్నారు. ఎల్ఎండీ ఎగువ ఆయకట్టుకు నీటి సరఫరాకు ప్రాజెక్టు అధికారులు ప్రణాళిక రూపొందించారు. నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలోని 4.50 లక్షల ఎకరాలకు ఆన్, ఆఫ్ పద్ధతిలో (వారం విడిచి వారం) విడుదల చేయనున్నారు. కాకతీయ కాలువ ద్వారా జోన్–1 ఆయకట్టు (డీ–5 నుంచి డీ–53 వరకు)కు వారం రోజులు, జోన్–2 ఆయకట్టు (డీ–54 నుంచి డీ–94 వరకు)కు వారం రోజులు సరఫరా చేయాలని నిర్ణయించారు. జోన్–2కు ఈనెల 25న జోన్–1కు జనవరి 2 నుంచి నీటిని విడుదల చేయనున్నారు. ఏప్రిల్ 8వ తేదీ వరకు పంటలకు సాగు నీరు అందించనున్నారు. కాకతీయ కాలువ ద్వారా మూడు నుంచి ఐదువేల క్యూసెక్కుల సామర్థ్యం ఉండేలా చూడనున్నారు. లక్ష్మీ ప్రధాన కాలువకు కూడా సాగు నీటిని విడుదల చేస్తున్నారు.

ఎస్సారెస్పీలో 80.053 టీఎంసీలు

ఎస్సారెస్పీలో ప్రస్తుతం నీటి మట్టం 1090.90 అడుగులతో 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి తాగునీటి అవసరాలకు కోరుట్ల, జగిత్యాల పట్టణాలకు 61 క్యూసెక్కులు, ఆదిలాబాద్, నిర్మల్ పట్టణాలకు 63 క్యూసెక్కులు, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డి పట్టణాలకు 107 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేస్తున్నారు.

చివరి ఆయకట్టుకూ చేరేలా..

ఎస్సారెస్పీ నీరు కాలువ చివరి భూములకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. కాలువలపై లస్కర్లు, అధికారులు కాలువలను పరిశీలించనున్నారు. అలీసాగర్, గుత్పా వంటి ఎత్తి పోతల పథకాలకు కూడా వారబందీ పద్ధతిలోనే నీటిని సరఫరా చేయనున్నారు. కాలువలకు గండ్లు పడితే వెంటనే మరమ్మతు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని హత్య



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రవీందర్

ములుగు: జిల్లాకేంద్రంలోని బండారుపల్లి రోడ్డు ఓపెన్ ప్లాట్లలో ఈనెల 21వ తేదీన అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఓర్సు శ్రీను(37) కేసును పోలీసులు ఛేదించారు. భార్య వివాహేతర సంబంధం పెట్టుకుని పథకం ప్రకారం శ్రీనును హత్య చేయించినట్లు పోలీసులు తెలిపారు. ములుగు డీఎస్పీ నలువాల రవీందర్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఓర్సు శ్రీను తన భార్య స్వప్నతో కలిసి హనుమకొండలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్వప్న తన స్వగ్రామం హసన్‌పర్తి మండలం మడిపల్లికి చెందిన బుర్ర సంతోష్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని, తరచూ మద్యం తాగొచ్చి వేధింపులకు గురిచేస్తున్నాడనే కారణంతో భర్తను హత్య చేయడానికి ప్లాన్ వేసింది. అనుకున్నదే తడవుగా సంతోష్‌కు రూ.30వేలు ఇవ్వగా అతడు తనకు తెలిసిన నడికుడ మండలం కంఠాత్మకూర్‌కు చెందిన ఆకుల అనిల్, బెల్లంకొండ చంద్రమోహన్‌తో కలిసి మేడారం వెళ్లడానికి ప్లాన్ చేశాడు. అయితే వీరితో పాటు మనం కూడా మేడారం వెళ్దామని స్వప్న తన భర్త శ్రీనును ఒప్పించింది. దీంతో 21వ తేదీ రాత్రి శ్రీను, స్వప్న, అనిల్, చంద్రమోహన్ ఆటోలో, సంతోష్ కారులో బయలుదేరారు. ఈ క్రమంలో రాత్రి 11 గంటలకు ములుగు సమీపంలో బండారుపల్లి రోడ్డు పక్కన ఉన్న ఓపెన్ ప్లాట్లకు తీసుకెళ్లి ప్లాన్ ప్రకారం శ్రీనుకు మద్యం తాగించారు. అనంతరం గొడవపడి రాయితో తలపై బలంగా కొట్టారు. దీంతో శ్రీను అక్కడికక్కడే చనిపోయాడు. ప్రాణం పోయిందని నిర్ధారించుకున్న తర్వాత ఘటనా స్థలి నుంచి పరారయ్యారు. మరుసటిరోజు సమాచారం అందుకున్న పోలీసులు.. డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు డీఎస్పీ రవీందర్ ఆధ్వర్యంలో పస్రా సీఐ రవీందర్, ములుగు ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, లక్ష్మారెడ్డి నేతృత్వంలోని మూడు ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ ఫుటేజీ ద్వారా ఆ రోజు రాత్రి వాహనాల కదలికలు గమనించారు. ఈ క్రమంలో మంగళవారం ములుగు మండలం గట్టమ్మ సమీపంలో నిందితులు స్వప్న, సంతోష్, అనిల్, చంద్రమోహన్‌ను అదుపులోకి తీసుకుని విచారింగా నేరం ఒప్పుకున్నారు. దీంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కారు, ఆటో, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు.